# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 308
పేజీలు : 08 | వెల: రూ.5/-
శుక్రవారం
సెప్టెంబర్ 19, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




8లో..

## ఎకో టూరిజం హబ్‌గా తెలంగాణ

- ఆలయాలున్న ప్రాంతాల్లో ఆధ్యాత్మిక శోభ
- నీలాద్రి అభివృద్ధికి ప్రత్యేక చొరవ
- రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ




# స్టేషన్ బాద్‌షా

## కడియం శ్రీహరి

వివరాలు 2లో..

- నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి
- ఇచ్చిన హామీల అమలుకు నిరంతర కృషి
- రూ.1,026 కోట్లతో వివిధ పనులకు గ్రీన్ సిగ్నల్
- ప్రగతిపథంలో దూసుకుపోతున్న స్టేషన్ ఘనపూర్
- సీఎం సహకారంతో పరుగులు పెట్టిస్తున్న ఎమ్మెల్యే



గతంలో ఎన్నడూ లేని విధంగా స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం అభివృద్ధిలో దూసుకుపోతోంది. ఇక్కడి అభివృద్ధిపై మాజీ డిప్యూటీ సీఎం, స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రత్యేక దృష్టి సారించారు. నియోజకవర్గ అభివృద్ధే శ్వాస.. ధ్యాసగా ఆయన పనిచేస్తున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటూ స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గాన్ని ప్రగతిపథంలో నిలుపుతున్నారు. కష్టపడే కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటూ తిరుగులేని నేతగా గుర్తింపు పొందారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహాయ, సహకారాలతో పనులను పరుగులు పెట్టిస్తున్నారు. పార్టీ ఫిరాయింపు విషయంలో ఎవరేమనుకున్నా పట్టించుకోకుండా నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నారు. కేవలం 21 మాసాల్లోనే రాష్ట్రంలోని ఏ నియోజకవర్గంలో లేని విధంగా రూ.1,026 కోట్ల నిధులతో వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలు చేపట్టి స్టేషన్ ఘనపూర్ బాద్ షాగా కీర్తింపబడుతున్నారు. కళ్ల ఎదుటే అభివృద్ధి పనులు కనిపించడంతో నియోజకవర్గ ప్రజలంతా కడియం శ్రీహరికి జేజేలు పలుకుతున్నారు. - వరంగల్ వాయిస్, స్టేషన్ ఘనపూర్



8లో..

## ఆల్ పార్టీస్ మోసం

- బడ్జెట్ లో బీసీలకు లక్ష కోట్లు కేటాయించాలి
- టీఆర్పీ రాష్ట్ర అధ్యక్షుడు తీన్మార్ మల్లన్న
- సమావేశంలో ప్రకటించిన వరంగల్ డిక్లరేషన్



2లో..

## పాత వంతెన మరమ్మతులకు రూ.59 లక్షలు

- రెండో వంతెన నిర్మాణంలో వేగం పెంచాలి
- అధికారులకు సూచించిన ఎమ్మెల్యే నాయిని



## విశ్వనాయకుడి బయోపిక్

- వీక్షించిన బీజేపీ నేతలు, జిల్లా అధ్యక్షుడు గంట రవి కుమార్

**వరంగల్ వాయిస్, కాశీబుగ్గ :** భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి వరంగల్ స్టేషన్ రోడ్ లోని ఎస్-2 మాల్ లో బీజేపీ జిల్లా నాయకులు భారత ప్రధాని నరేంద్ర మోదీ జీవిత కథ బయోపిక్ మూవీని విక్షించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ భారత దేశ సంస్కృతిని ప్రపంచ దేశాలు అనుసరించే విధంగా దేశాన్ని పరిపాలిస్తున్న మహనీయుకుడని కొనియాడారు. భారత దేశాన్ని ప్రపంచంలో అగ్రగామి దేశంగా నిలపడానికి ఎంతో కృషి చేస్తున్న ( మిగితా 2లో.. )

# స్టేషన్ బాద్ షా..

## కడియం శ్రీహరి



- నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి
- ఇచ్చిన హామీల అమలుకు నిరంతర కృషి
- రూ.1,026 కోట్లతో వివిధ పనులకు గ్రీన్ సిగ్నల్
- ప్రగతిపథంలో దూసుకుపోతున్న స్టేషన్ ఘనపూర్
- సీఎం సహకారంతో పరుగులు పెట్టిస్తున్న ఎమ్మెల్యే

**వరంగల్ వాయిస్, స్టేషన్ ఘనపూర్ :** స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ అభివృద్ధికి వేగంగా అడుగులు పడుతున్నాయి. నియోజకవర్గ అభివృద్ధే శ్వాస.. ధ్యాసగా పనిచేస్తున్న మాజీ డిప్యూటీ సీఎం, స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్టేషన్ ఘనపూర్ ను ప్రగతిపథంలో నిలిపేందుకు కృషి చేస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహాయ, సహకారాలతో సమగ్రాభివృద్ధికి రూ.1,026 కోట్లతో ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నారు. అభివృద్ధి కోసమే కాంగ్రెస్ తో కలిసి పని చేస్తున్నానంటూ ప్రకటిస్తున్న కడియం శ్రీహరి ఆ దిశగా నిధులు రాబట్టేందుకు సర్వశక్తులు ఒడ్డుతున్నారు. నీతి, నిజాయితీలే పెట్టుబడిగా ముందుకు సాగుతున్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటూ అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నారు. కష్టపడే కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటూ ప్రగతి పథంలో దూసుకుపోతున్నారు.

### అభివృద్ధి కోసమే కాంగ్రెస్ తో కలిసి పనిచేస్తున్నా..

స్టేషన్ ఘన్ పూర్ నియోజకవర్గ అభివృద్ధి కోసమే కాంగ్రెస్ పార్టీతో కలిసి పని చేస్తున్నానని మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మె ల్యే కడియం శ్రీహరి స్పష్టం చేశారు. శుక్రవారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తనకు నియోజకవర్గ ప్రజల శ్రేయస్సే ముఖ్యమని, అందుకే గత ఏడాదిన్నరగా నియోజకవర్గంలో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నానని వెల్లడించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న గత పదేళ్లలో అన్ని పార్టీల్లోని 36 మంది ఎమ్మెల్యేలను పార్టీలో చేర్చుకుని ఇద్దరికి మంత్రి పదవులు కూడా ఇచ్చిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. రాష్టంలో రాజకీయ వ్యవస్థను భ్రష్టు పట్టించిన కేసీఆర్ నేడు ఫామ్ హౌస్ కు పరిమితం అయ్యారన్నారు. అప్పుడు లేని విలువలు ఇప్పుడే గుర్తుకువచ్చాయా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ వాళ్లు చేస్తే సంసారం.. కాంగ్రెస్ వాళ్లు చేస్తే వ్యభిచారమా అని నిలదీశారు. తాను రాజకీయ జీవితంలో ఎన్నడూ ఎలాంటి అవినీతికి పాల్పడలేదని, ఏనాడూ పదవులను అడుక్కోలేదని, కేసీఆర్ పిలిచి తనను డిప్యూటీ సీఎం చేశారని తెలిపారు. స్పీకర్ తనతోపాటు పలువురికి నోటీసులు ఇచ్చారని, ఆ నోటీసులపై స్పందించేందుకు ఇంకా సమయం ఉందన్నారు. ఈనెల ఆఖరు లోపు సమాదానం చెప్తానన్నారు. స్పీకర్ నిర్ణయాన్ని బట్టే భవిష్యత్తు ఉంటుందన్నారు.

### వ్యక్తిగత విమర్శలు తగదు..

వ్యక్తిగత విమర్శలు చేయడం రాజకీయాలకు మంచిది కాదని కడియం శ్రీహరి హితవు పలికారు. బీఆర్ఎస్ నేతల తనపై ఇష్టం వచ్చినట్లు సోయి తప్పి మాట్లాడుతన్నారని, అయితే తాను వారిలా మాట్లాడేందుకు సభ్యత, సంస్కారం అడ్డు వస్తున్నదని అన్నారు. వారి వ్యాఖ్యలను వాళ్ల విజ్ఞతకే వదిలేస్తున్నానన్నారు. 15ఏళ్లు ఎమ్మెల్యేగా ఉండి నియోజకవర్గ అభివృద్ధిని పట్టించుకోకుండా, అవినీతి అక్రమాలకు పాల్పడుతూ, చిలిపి పనులు చేసి దళిత బంధు అమ్ముకుని, బి ఫాం అమ్ముకున్న వ్యక్తులు ఈ రోజు సుద్ద పూసలాగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. రాజకీయ విధానాలపై, అభివృద్ధి పనులపైన మాట్లాడితే సమాధానం చెప్పవచ్చు కానీ ఇలాంటి దిగజారుడు మాటలకు ఎలాంటి సమాధానం చెప్పాలన్నారు. ఇలాంటి వ్యక్తుల వల్లే రాజకీయాలు భ్రష్టు పడుతున్నాయని విమర్శించారు.



### ఎంత చేసినా తక్కువే..

రాష్ట్రంలో కడియం శ్రీహరికి ఈ హోదా, పేరు ఉందంటే దానికి కారణం స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ప్రజలు పెట్టిన రాజకీయ బిక్ష మాత్రమే అని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. 21 నెలల్లోనే రూ.1026 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. సాగు నీరు, విద్యా, వైద్యంతో పాటు విద్యుత్ రంగాలకు పెద్ద పీట వేస్తున్నట్లు వెల్లడించారు. రూ.148 కోట్లతో దేవాదుల ఉప కాల్వల మరమ్మత్తు చేయడం ద్వారా చివరి ఆయకట్టు వరకు గోదావరి నీళ్లు వెళ్తున్నాయని, లింగాల ఘనపూర్ మండలంలో తొలిసారి అనేక చెరువులు నింపుకున్నామని అన్నారు. దేవాదుల 3దశ 6వ ప్యాకేజీ సవరించిన అంచనాలకు రూ.1,015 కోట్లతో చేపట్టనున్న పనుల ద్వారా నాలుగు నియోజకవర్గాలలో 78వేల ఎకరాలకు సాగు నీరు అందనుందని తెలిపారు. రానున్న ఏడాదిలో నియోజకవర్గంలోని ప్రతీ గ్రామానికి గోదావరి జలాలు అందించే బాధ్యత తనదని హామీ ఇచ్చారు. రూ.200కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రెటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరు అయ్యాయని తెలిపారు. నియోజకవర్గ కేంద్రంలో రూ.45.50 కోట్లతో 100 పడకల అస్పత్రి నిర్మాణం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలో రైతులకు విద్యుత్ సమస్యలు ఏర్పడకుండా ఉండేందుకు అనేక సబ్ స్టేషన్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ఇంత పెద్ద మొత్తంలో నిధులు మంజూరు కావడం కాంగ్రెస్ ప్రభుత్వం వల్లే సాధ్యమైందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# పాత వంతెన మరమ్మతులకు రూ. 59 లక్షలు

- రెండో వంతెన నిర్మాణంలో వేగం పెంచాలి
- అధికారులకు సూచించిన ఎమ్మెల్యే నాయిని

**వరంగల్ వాయిస్, కాజీపేట :** కాజీపేట రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్ఓబీ) పనులను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి శుక్రవారం పరిశీలించారు. మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా జరుగుతున్న ఈ పనుల పురోగతిని ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాజీపేట ఆర్ఓబీ కింద మొదటి వంతెన పనులు ఇప్పటికే పూర్తయ్యాయని, రెండో వంతెన నిర్మాణం కూడా కొంతమేర పురోగమించిందని తెలిపారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలను కల్పించి, ట్రాఫిక్ సమస్యను తగ్గించేందుకు రెండో వంతెన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పనుల్లో ఎలాంటి జాప్యం జరగకుండా చూడాలన్నారు. పాత వంతెన మరమ్మతు పనులకు ప్రభుత్వం రూ. 59 లక్షల నిధులు మంజూరు చేసిందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ నిధులను సమర్థవంతంగా వినియోగించుకుని వంతెనను మరింత సురక్షితంగా మార్చాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక ప్రజలు, అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి పాత వంతెన వద్ద జరుగుతున్న మరమ్మతు పనులను పరిశీలించి, నాణ్యతా ప్రమాణాలను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** తెలంగాణ రికగ్నిషన్ స్కూల్ మేనేజ్మెంట్ అసోసియేషన్ (ట్రస్మా) వరంగల్ వారి ఆధ్వర్యంలో గురువారం రాత్రి నగరంలోని నాని గార్డెన్స్ లో బెస్ట్ టీచర్ అవార్డు గ్రహీతలకు ఘన సన్మానం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్ రెడ్డి హాజరయ్యారు. వాణి విద్యానికేతన్ హై స్కూల్ లో పనిచేస్తున్న మహమ్మద్ నజీర్ అహ్మద్, దేవరకొండ ఈశ్వర్, చుంచు రమాదేవి, మిర్జా ఉస్మా సాదియా, ప్రతాపగిరి జమునకు బెస్ట్ టీచర్ అవార్డ్స్ లభించాయి. ఈ మేరకు శుక్రవారం ఉదయం పాఠశాలలో ఉపాధ్యాయులను పాఠశాల యాజమాన్యం సామల సుధాకర్, స్వరూప, మురళీకృష్ణ ఘనంగా సన్మానించారు. తమ పాఠశాలలో 15 సంవత్సరాలకు పైగా సేవలు అందిస్తూ విద్యార్థులకు ఉన్నత చదువులు అందిస్తున్న ఉత్తమ ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు అందజేశారు. తమ పాఠశాల నుంచి ఐదుగురికి బెస్ట్ టీచర్ అవార్డ్స్ రావడం గర్వంగా ఉందన్నారు. తమ పాఠశాల విద్యార్థుల కరతల ధ్వనులమధ్య శాలువా కప్పి అభినందనలు తెలియజేశఆరు.

### విశ్వనాయకుడి బయోపిక్

(మొదటి పేజీ తరువాయి..) ఆ మహనీయుని బయోపిక్ చూడడం అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు. మోదీ పాలన, అభివృద్ధి, సంక్షేమం రెండు కన్నులుగా ముందుకు తీసుకెలుతున్నాడన్నారు. వారి జీవితం కూడ అంతే ఆదర్శం. ఒక్కరోజు కూడ సెలవు తీసుకోకుండా 13 ఏళ్లు సీఎంగా, గత 12 ఏళ్లుగా ప్రధానిగా దేశానికి సేవలనదిస్తున్నారన్నారు. కేవలం రోజుకు 4 గంటలు మాత్రమే నిద్రపోయి, మిగత సమయం మొత్తం దేశాసేవకు అంకిత భావంతో పని చేస్తున్న నిత్య శ్రామికుడు, కృషీవలుడు మోదీ అని కొనియాడారు. వారి జీవితం నేటి తరానికి, రాబోవు తరానికి ఆదర్శంగా నిలవనున్నారు. ప్రపంచ దేశాలు యుద్ధాలతో కొట్టుకొని చస్తున్న తరుణంలో శాంతి మార్గంలో దేశాన్ని ముందుకు తీసుకెళుతున్నాడు. అమెరికా భారత వస్తువుల పై వేస్తున్న పన్ను సేవలను వాణిజ్య ఒప్పందాలకు కట్టుబడి అంతే ధైర్యంగా ఎదుర్కొని బుద్ధి చెప్పి తగ్గించిన ఘనత మోడీది అన్నారు. ప్రస్తుతం జీఎస్టీని తగ్గించి పేద బడుగు బలహీన వర్గాలకు పేదల పెన్నిధిగా మోడీ మారారని గంట రవికుమార్ అన్నారు. ఈ మోడీ బయోపిక్ ను 24వ తేదీ వరకు ఉచితంగా ప్రదర్శించబడుతుందన్నారు. మోడీ అభిమానులు, యువత, బీజేపీ శ్రేణులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి

◆ ఇంచార్జి కలెక్టర్ పింకేష్ కుమార్



**వరంగల్ వాయిస్, జనగామ :** నిరుపేదలకు వైద్య సేవలు అందించడంలో వైద్యులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జనగామ ఇంఛార్జ్ కలెక్టర్ పింకేష్ కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన ఓబుల్ కేశ్వపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పీహెచ్‌సీ) ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా ఆయన మొదటగా డ్యూటీ డాక్టర్ల రిజిస్టర్లు, ఓపీ (ఔట్‌పేషెంట్), ఇన్‌పేషెంట్ తదితర రికార్డులను పరిశీలించారు. అనంతరం, 'స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభయాన్' కార్యక్రమంలో భాగంగా ప్రముఖ దంత వైద్యుడిచే నిర్వహిస్తున్న స్పెషాలిటీ క్లినిక్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, 'ఎస్ఎంఎస్–పీఏ' (స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభయాన్) సేవలను ప్రతి గ్రామంలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఫార్మసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్ సేవలు, ఓపీ, ఇన్‌పేషెంట్లకు అందుతున్న చికిత్స గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ సేవలను గ్రామ ప్రజలకు తెలియజేయాలని ఎంపీడీఓను ఆదేశించారు. ఇన్‌పేషెంట్లు, ఏఎన్‌సీ (గర్భిణీ) కేసులతో మాట్లాడి పీహెచ్‌సీలో అందుతున్న సేవల గురించి ఆరా తీశారు. పీహెచ్‌సీ ఆవరణ ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి మల్లిఖార్జున రావు, వైద్యులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



**వరంగల్ వాయిస్, జనగామ:** జాతీయ రక్తదాన వారోత్సవాలను పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఆఫ్ జనగామ మిలీనియం ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. లయన్స్ జిల్లా 320 ఎఫ్ గవర్నర్ చంద్రశేఖర్ ఆర్య, ఆయన సతీమణి రాజేశ్వరి పుట్టినరోజు సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. క్లబ్ అధ్యక్షుడు లయన్ బండ భిక్షపతి నేతృత్వంలో జరిగిన ఈ శిబిరంలో లయన్ బైరు గౌతమ్ తన 20వ పుట్టినరోజు సందర్భంగా తొలిసారిగా రక్తదానం చేసి అందరికీ ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా పూర్వ రీజియన్ చైర్మన్ శ్రీరామ్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఇంత చిన్న వయసులోనే రక్తదానంపై అవగాహన పెంచుకొని, రక్తదానం చేసిన బైరు గౌతమ్‌ను అభినందించారు. యువత ఆయనను స్ఫూర్తిగా తీసుకొని రక్తదానం వంటి సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జోన్ చైర్మన్ బైరు వెంకటేశ్వర్లు, బ్లడ్ బ్యాంక్ డాక్టర్లు కరుణాకర్ రాజు, మోర్తాల దివ్య పాల్గొని రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు.

## శరన్నవరాత్రి ఏర్పాట్ల పరిశీలన

**వరంగల్ వాయిస్, వరంగల్ :** శరన్నవరాత్రుల సందర్భంగా వరంగల్ భద్రకాళి అమ్మవారి ఆలయాన్ని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పరిసరాల్లో జరుగుతున్న శరన్నవరాత్రుల ఏర్పాట్లను పరిశీలించారు. ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించాలని ఆయన సూచించారు. భద్రకాళి అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరికీ శాంతి, సుఖ సంతోషాలు కలగాలని ఆయన ఆకాంక్షించారు.



## రాపాక ఉదయ్ శర్మకు పురోహిత దిగ్గజ అవార్డు




**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్‌కు చెందిన ప్రముఖ వాస్తు పురోహితులు, వివర్స్ కాలనీ శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయ ప్రధాన అర్చకులు రాపాక ఉదయ్ శర్మ విశిష్ట సేవలకు గాను "పురోహిత దిగ్గజ" అవార్డు లభించింది. విల్లుపురం (తమిళనాడు) కేంద్రంగా పనిచేస్తున్న ఇంటర్నేషనల్ హిందూ టెంపుల్స్ అండ్ స్పిరిట్యుయల్ ఆస్ట్రాలజర్స్ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వరంగల్‌లోని పుష్పరాజ్ కన్వెన్షన్ హాల్‌లో శనివారం '6వ ఇంటర్నేషనల్ స్పిరిట్యుయల్ ఆస్ట్రాలజికల్ కాన్ఫరెన్స్, ఐకానిక్ అవార్డ్స్ తెలంగాణ –2025' వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా, సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ జె. విశ్వనాథన్ చేతుల మీదుగా, పలువురు ప్రముఖ పండితుల సమక్షంలో రాపాక ఉదయ్ శర్మను శాలువాతో సత్కరించి "పురోహిత దిగ్గజ" బిరుదును అందజేశారు.

## లంబాడీల నిరసన సభలో జిల్లా నాయకులు



**వరంగల్ వాయిస్, హైదరాబాద్:** హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద శుక్రవారం జరిగిన లంబాడీల ఆత్మగౌరవ నిరసన సభకు జనగామ జిల్లా నాయకులు హాజరయ్యారు. ఈ సభలో ఎల్–జేఏసీ జనగామ జిల్లా కన్వీనర్లు భిక్షపతి నాయక్, కొర్ర రాజేందర్ నాయక్ పాల్గొన్నారు. వీరితో పాటు రఘునాథపల్లి మండల ఎల్ హెచ్ పీఎస్ నాయకులైన సంతోష్ నాయక్, కృష్ణ నాయక్, మల్లేష్ నాయక్, చంద్రశేఖర్ నాయక్, మహేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలపై కమిషనర్‌కు వినతి



**వరంగల్ వాయిస్, జనగామ :** పట్టణంలోని 17వ వార్డులో పేరుకుపోయిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం పార్టీ డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా సీపీఎం టౌన్ కమిటీ సభ్యుడు పాము శ్రీకాంత్ మాట్లాడుతూ 17వ వార్డులో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని, మురుగు కాలువలను శుభ్రం చేయాలని కోరారు. ఈ సమస్యలను వార్డు ఇంచార్జిల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా ఫలితం లేదని, సిబ్బంది కొరత కారణంగా చెత్త సేకరణ సరిగా జరగడం లేదని ఆయన ఆరోపించారు. వెంకన్న కుంట ప్రాంతంలో మూడు నాలుగు డెంగ్యూ కేసులు నమోదయ్యాయని శ్రీకాంత్ తెలిపారు. అయినా అధికారులు దోమల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని, ఫాగింగ్, బ్లీచింగ్ పౌడర్ చల్లడం వంటివి చేయడం లేదని విమర్శించారు. దీనివల్ల దోమలు పెరిగి డెంగ్యూ జ్వరాలు వస్తున్నాయని, అధికారులు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ కమిషనర్ తక్షణమే స్పందించి దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని, మురుగు కాలువలను శుభ్రం చేయించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పూజారి సతీష్, వేముల రవీందర్, చిలువేరు ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ వాల్ పోస్టర్ల కలకలం



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి:** స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు రఘునాథపల్లి మండల కేంద్రంలో పెద్ద ఎత్తున వాల్ పోస్టర్లను అంటించి, కడియం శ్రీహరిపై తీవ్ర విమర్శలు చేశారు. "కడియం గారు, మీ రాజీనామా ఎప్పుడు?" అంటూ పోస్టర్ల ద్వారా నిలదీశారు. బీఆర్ఎస్ కార్యకర్తల చెమట కష్టంతోనే కడియం శ్రీహరికి ఎమ్మెల్యే పదవి దక్కింది. ఎమ్మెల్యే పదవికి వెంటనే రాజీనామా చేసి, ఆ తర్వాత ఏ పార్టీ నుంచైనా పోటీ చేసుకోవాలి. ప్రజల సమస్యలను విస్మరించి, కేవలం వ్యక్తిగత ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రజలు ఇటువంటి స్వార్థపూరిత రాజకీయాలను సహించరన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వై. కుమార్ గౌడ్, మండల కన్వీనర్ మున్సిపట్ల విజయ్, జిల్లా నాయకులు గూడ కిరణ్ కుమార్, మండల యూత్ నాయకులు దుబ్బాక హరీష్ గౌడ్, ముప్పిడి సాంబ, పరుశురాముల గౌడ్, దుబ్బాక నర్సింలు, కోళ్ల శీను గౌడ్ వంటి పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ ఘటనతో రఘునాథపల్లిలో రాజకీయ చర్చ జోరందుకుంది.

## పత్తి పంటపై రైతు క్షేత్ర ప్రదర్శన



**వరంగల్ వాయిస్, నడికూడ:** మండల కేంద్రంలోని రైతు బుడిమే ఉపేందర్ పొలంలో రాశి సీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో శుక్రవారం రైతు క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాశి స్విఫ్ట్ అనే హైబ్రిడ్ పత్తి రకం గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న టెరిటరీ సేల్స్ మేనేజర్ పవన్ రెడ్డి మాట్లాడుతూ, రాశి స్విఫ్ట్ హైబ్రిడ్ పత్తి రకం త్వరగా పంట దిగుబడికి వస్తుందని తెలిపారు. ఇది రెండో పంట వేసుకునే రైతులకు ఎంతో అనుకూలమైనదని, ప్రతికూల వాతావరణ పరిస్థితులను తట్టుకుని ఎక్కువ కాయలను నిలుపుకోవడం ద్వారా రైతులకు అత్యధిక దిగుబడిని అందిస్తుందని వివరించారు. ఈ ప్రదర్శనలో రాశి కంపెనీ పీఓ యు.శ్రీనివాస్ తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

## బదిలీ అయిన ఉద్యోగులకు ఎంపీడీవో సన్మానం



**వరంగల్ వాయిస్, నడికూడ:** మండల పరిషత్ కార్యాలయంలో బదిలీపై వెళ్తున్న ఉద్యోగులకు మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) గజ్జెల విమల ఆధ్వర్యంలో ఘనంగా వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా బదిలీ అయిన ఉద్యోగులను సన్మానించి, వారి సేవలను అభినందించారు. బదిలీ అయిన వారిలో ఎంపీఓ రవి, పంచాయతీ కార్యదర్శి నమిండ్ల విద్యాసాగర్, అలాగే జీపీఓలుగా వెళ్తున్న ఫాతిమా, రాజేంద్ర ప్రసాద్ ఉన్నారు. ఎంపీడీవో విమల వారికి శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందజేసి ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో ఈసీ రజినీకాంత్, సీనియర్ అసిస్టెంట్ సరోజన, టీఏలు స్వప్న, కుసుమ, మండలంలోని గ్రామ పంచాయతీ కార్యదర్శులు నాగరాజు, భిక్షపతి, భార్గవి, మౌనిక, స్రవంతి, వెన్నెల, స్వప్న, నర్సింగం, అరుణ్, కరుణ, సాంబశివ, ఫీల్డ్ అసిస్టెంట్లు రవి, రాములు, రవీందర్, భిక్షపతి, శ్రీనివాస్, కొమురయ్య, మొగిలి, కంప్యూటర్ ఆపరేటర్లు ఆసిఫ్, సాగర్, ప్రకాష్, దర్శన్, కార్యాలయ సిబ్బంది గోవిందు నవీన్ కుమార్, దొంతుల రాజేందర్, కౌకొండ కారోబార్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ్ కుమార్ రెడ్డి తండ్రి వర్ధంతి సభ

### హాజరైన కాంగ్రెస్ నేత బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, హైదరాబాద్:** జూబ్లీహిల్స్‌లోని జేఆర్‌సీ కన్వెన్షన్ హాల్‌లో తెలంగాణ భారీ నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తండ్రి దివంగత నలమాద పురుషోత్తం రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సభలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు. వారు పురుషోత్తం రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

## విత్తనోత్పత్తిపై రైతులకు అవగాహన



**వరంగల్ వాయిస్, నడికూడ :** రైతులకు అధిక దిగుబడినిచ్చే నాణ్యమైన విత్తనాలను అందుబాటులోకి తీసుకురావడం లక్ష్యంగా తెలంగాణ వ్యవసాయ శాఖ, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం సంయుక్తంగా 'గ్రామ గ్రామాన నాణ్యమైన విత్తనం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం నడికూడ మండలంలోని ముత్యాలపల్లి గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, వరంగల్ శాస్త్రవేత్తలు క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. రైతులు వరి, కంది పంటల విత్తనోత్పత్తిలో పాటించాల్సిన మెలకువలను వారికి వివరించారు. ముఖ్యంగా, యూరియా వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, వరంగల్ ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ వెంకన్న, ఎల్. కృష్ణ, శాస్త్రవేత్తలు డాక్టర్ భార్గవి, పద్మజ, మండల వ్యవసాయ అధికారి పోరిక జై సింగ్, వ్యవసాయ విస్తరణ అధికారులు జనగాం ప్రదీప్, సూత్రపు గోపీనాథ్, పలువురు రైతులు పాల్గొన్నారు.

## ప్రపంచ ఫార్మసిస్ట్స్ దినోత్సవానికి మంత్రులకు ఆహ్వానం



**వరంగల్ వాయిస్, హైదరాబాద్:** తెలంగాణ గవర్నమెంట్ ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ (టీజీపీఓఏ) సెంట్రల్ కమిటీ అధ్యక్షుడు బత్తిని సుదర్శన్ గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం పలువురు మంత్రులను, అధికారులను కలిశారు. సెప్టెంబర్ 25న హైదరాబాద్‌లో జరగనున్న "ప్రపంచ ఫార్మసిస్ట్స్ దినోత్సవం" వేడుకలకు ముఖ్య అతిథులుగా హాజరు కావాల్సిందిగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి.దామోదర రాజనర్సింహ, బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చోంగ్తలను కలిసి ఆహ్వాన పత్రాలు అందజేశారు. ఈ ఆహ్వానంపై వారు సానుకూలంగా స్పందించి, కార్యక్రమానికి తప్పకుండా హాజరవుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీజీపీఓఏ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ కందకట్ల శరత్ బాబు, స్టేట్ అసోసియేట్ ప్రెసిడెంట్ జాలిగామ అశోక్, హైదరాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏవీ. శ్రీహరి, ఎస్.ఆనంద్ కుమార్, టీఎంహెచ్ఈయూ స్టేట్ ప్రెసిడెంట్ రాబర్ట్ బ్రూస్ తదితరులు పాల్గొన్నారు.

## ఆవిష్కరణలకు వేదికగా రీసెర్చ్ స్కాలర్స్ కాన్ఫ్లుయెన్స్

### ◆ పరిశోధనలో పేటెంట్లు, స్టార్టప్‌లకు ప్రాధాన్యం

**వరంగల్ వాయిస్, వరంగల్ (నిట్ ) :** నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ) వరంగల్‌లో రెండవ రీసెర్చ్ స్కాలర్స్ కాన్ఫ్లుయెన్స్ శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. సెప్టెంబర్ 19-20 తేదీల్లో రెండు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమం పీహెచ్‌డీ పరిశోధకుల మధ్య సహకారం, విజ్ఞాన మార్పిడి, బహుళ రంగాల పరిశోధనలను ప్రోత్సహించే లక్ష్యంతో నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని గతి శక్తి విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ మనోజ్ చౌధరి, ఎన్ఐటీ వరంగల్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుభుధి, ఎన్ఐటీ వరంగల్ అకడమిక్ డీన్ ప్రొఫెసర్ వెంకయ్య చౌధరి సంయుక్తంగా ప్రారంభించారు. ప్రొఫెసర్ వెంకయ్య చౌదరి మాట్లాడుతూ ఈ కాన్ఫ్లుయెన్స్‌లో 125 మంది పీహెచ్‌డీ విద్యార్థులు తమ పరిశోధనలకు సంబంధించిన పోస్టర్లను ప్రదర్శిస్తున్నారని, అందులో 45 మందిని మౌఖిక ప్రదర్శనలకు ఎంపిక చేశామని తెలిపారు. ప్రస్తుతం ఎన్ఐటీ వరంగల్‌లో 1,400 మంది పీహెచ్‌డీ విద్యార్థులు ఉన్నారని, గత ఏడాది 150 మంది పట్టభద్రులయ్యారని పేర్కొన్నారు. ఎన్ఐటీ వరంగల్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుభుధి మాట్లాడుతూ సంస్థలో పరిశోధనల విస్తృతి పెరిగిందని, రూ. 650 కోట్లతో రీసెర్చ్ పార్క్ ఏర్పాటుకు ఎన్ఐటీకి అనుమతి లభించిందని తెలిపారు. పరిశోధన కేవలం ప్రచురణలకే పరిమితం కాకుండా, స్టార్టప్‌లను స్థాపించడం, పేటెంట్లను పొందడం, సమాజానికి ఉపయోగపడే సమస్యలను పరిష్కరించడంలోనూ పరిశోధకులు ముందుండాలని పిలుపునిచ్చారు.



పీహెచ్‌డీ పరిశోధకులు దేశాభివృద్ధికి వెన్నెముకగా నిలుస్తారని ఆయన అన్నారు. ప్రధానోపన్యాసం చేసిన గతి శక్తి విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ మనోజ్ చౌధరి 'పర్పస్ డ్రివెన్ రీసెర్చ్' ఆవశ్యకతను నొక్కి చెప్పారు. వ్యక్తిగతంగా కాకుండా బృందంగా కలిసి పనిచేయడం ద్వారా మానవాళికి ఉపయోగపడే పరిశోధనలు చేయాలని సూచించారు. పరిశోధకులు పరిశ్రమలతో కలిసి పనిచేసి సమస్యలను పరిష్కరించాలని కోరారు. వేగంగా మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా 'కనెక్ట్, కమ్యూనికేట్, షేర్, కొలాబొరేట్' అనే మంత్రాన్ని అనుసరించాలని పీహెచ్‌డీ పరిశోధకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌డీ పరిశోధకులు, మాస్టర్స్ విద్యార్థులు, అధ్యాపకులు చురుగ్గా పాల్గొన్నారు. కార్యక్రమ సమన్వయ బాధ్యతలను ప్రొఫెసర్ రవిశంకర్, అసోసియేట్ డీన్ (పీహెచ్‌డీ), వారి బృందం చూసుకున్నారు

## ఘనంగా పైడాకుల అశోక్ జన్మదిన వేడుకలు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ములుగు జిల్లా డీసీసీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం వరంగల్‌లో కాంగ్రెస్ నాయకుడు సిద్ధంశెట్టి నితిన్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా జరిగాయి. వరంగల్‌లోని సహస్ర ఫౌండేషన్, మదర్సాలలో నివసించే చిన్నారుల మధ్య కేక్ కట్ చేసి అశోక్ పుట్టినరోజును జరుపుకున్నారు. ఈ సందర్భంగా





పిల్లలకు అన్నదానం కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిద్ధంశెట్టి నితిన్ మాట్లాడుతూ పైడాకుల అశోక్ ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. అలాగే, ఉన్నత పదవులు పొంది ప్రజలకు సేవ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోలి శివ, మహ్మద్ గౌస్, కమటం రంజిత్, బజ్జూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ





**వరంగల్ వాయిస్, దామెర :** మండలంలోని పసరుగొండ గ్రామానికి చెందిన మంద సదయ్య మరణించగా, బీజేపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ రావు శుక్రవారం వారి నివాసానికి వెళ్లారు. మంద సదయ్య భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం మామిడి సాంబక్క కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే, ఓగ్లాపూర్ ఓబీసీ మోర్చా మాజీ మండల అధ్యక్షులు నాగుల సదయ్య మామగారి కుటుంబాన్ని కూడా పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేసి, ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో దామెర మండల అధ్యక్షులు వేల్పుల రాజ్ కుమార్, జిల్లా కౌన్సిల్ సభ్యులు పావుడాల మధుకర్, మండల ఉపాధ్యక్షులు చిలువేరు చంద్ర కిరణ్, జిల్లా కిసాన్ మోర్చా అధికార ప్రతినిధి గంకిడి బుచ్చిరెడ్డి, పసరుగొండ మాజీ సర్పంచ్ మంద రమేష్, యువ మోర్చా మండల అధ్యక్షులు కొట్టే రమేష్, బూత్ అధ్యక్షులు చెక్క సతీష్, మంద మనోజ్ కుమార్, మాజీ సర్పంచ్ మంద దేవేందర్, ఐత రాజు, మేడిపల్లి శ్రీనివాస్, చెక్క రాజు, మంద కట్టయ్యతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## తొర్రూరు పీఏసీఎస్‌లో భారీగా అవకతవకలు

### ■ చైర్మన్ సహా పాలకవర్గం తొలగింపు
### ■ ఇంఛార్జిగా అసిస్టెంట్ రిజిస్ట్రార్ నియామకం

**వరంగల్ వాయిస్, తొర్రూరు :** స్థానిక ప్రైమరీ అగ్రికల్చర్ కోఆపరేటివ్ సొసైటీ (పీఏసీఎస్)లో తీవ్రమైన ఆర్థిక అవకతవకలు వెలుగులోకి వచ్చాయి. దీనిపై జిల్లా సహకార అధికారి సమర్పించిన నివేదిక ఆధారంగా, చైర్మన్ కాకిరాల హరిప్రసాద్ తో సహా ప్రస్తుత పాలకవర్గాన్ని ప్రభుత్వం తొలగించింది. వారి స్థానంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ కె. రమేష్‌ను పర్సన్ ఇంఛార్జిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా సహకార అధికారి నివేదికలో పాలకవర్గం పలు తీవ్రమైన లోపాలను కలిగి ఉందని పేర్కొంది. వాటిలో ముఖ్యమైది రూ. 89 లక్షలకు పైగా బకాయిలు వసూలు చేయకపోవడం కాగా, సొసైటీకి రావాల్సిన రూ. 89 లక్షల బకాయిలను వసూలు చేయడంలో పాలకవర్గం విఫలమైంది. నాబార్డ్ మార్గదర్శకాలను పట్టించుకోకుండా, సిబ్బంది, నిర్వహణ ఖర్చులను అధికంగా చూపించారు. పీఏసీఎస్‌కు చెందిన రూ. 8.39 కోట్లకు పైగా ఉన్న రుణాలను వసూలు చేయడంలో పాలకవర్గం నిర్లక్ష్యం వహించింది. సొసైటీ సభ్యుల రుణాల డిఫాల్టర్ల జాబితాను సిద్ధం చేయకపోవడం, రికవరీ చర్యలు చేపట్టకపోవడం వంటి లోపాలు గుర్తించారు. అంతేకాకుండా, కమిటీ సభ్యులలోనే డిఫాల్టర్లు ఉండటం





పరిస్థితి తీవ్రతను వెల్లడించింది.2021-22 నుంచి 2023-24 వరకు ఆడిట్ నివేదికలలో చూపిన లోపాలను సరిచేయలేదు. అలాగే, వార్షిక బడ్జెట్‌ను సిద్ధం చేసి ఆమోదం పొందడంలో విఫలమయ్యారు. ఈ విషయాలన్నీ తీవ్రమైన ఆర్థిక అవకతవకలకు దారితీశాయని నివేదికలో పేర్కొన్నారు. ఈ పరిణామాలపై ప్రతిపక్షాలు తీవ్రంగా స్పందిస్తూ, "కాకిరాల హరిప్రసాద్ నాయకత్వంలో రైతుల నిధులు సురక్షితం కాలేదు, ఆర్థిక అవకతవకలతో సంస్థ ప్రతిష్ట దెబ్బతింది" అని ఆరోపించారు.

# ప్రజల రక్షణే.. పోలీసుల బాధ్యత

## దామెర ఎస్ఐ కొంక అశోక్




ముఖా ముఖి

**వరంగల్ వాయిస్ :** మండలంలో పోక్సో కేసులు నమోదైన ఘటనలు ఉన్నాయా?

**ఎస్సై :** మండల పరిధిలోని రెండు తండాల్లో పోక్సో కేసులు రెండు నమోదైనవి. పోక్సో చట్టంపై మండలంలో అవగాహన కల్పిస్తున్నాం. పోక్సో చట్టం ప్రకారం పిల్లలపై లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన శిక్షలు ఉంటాయని, 18ఏళ్ల లోపు వయసు గల పిల్లల పై వేధింపులకు పాల్పడకుండా ఈ చట్టం ఉపయోగపడుతుందని తెలిపారు.

**వరంగల్ వాయిస్ :** గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారా? ప్రస్తుతం పని చేస్తున్నాయా?

**ఎస్సై :** గతంలో మండలంలోని అన్ని రెవెన్యూ గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. నిర్వహణ లోపంతో గత కొంతకాలంగా సీసీ కెమెరాలు పని చేయడం లేదు. ప్రస్తుతం అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాం. దాతలు సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలి.

**వరంగల్ వాయిస్ :** త్వరలో జరిగే ఎన్నికలకు పోలీస్ శాఖ సిద్ధంగా ఉందా? గ్రామాల్లో వాతావరణం ఎలా ఉంది?

**ఎస్సై :** ఎన్నికల ఎప్పుడు నిర్వహించినా పోలీస్ శాఖ సిద్ధంగా ఉంది. ఇప్పటికే మండలంలోని పలు సమస్యాత్మక గ్రామాలను గుర్తించాం. ఆయా గ్రామాల్లోని అన్ని పార్టీల నాయకులతో మాట్లాడుతున్నాం. మంద ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నాం.

**వరంగల్ వాయిస్ :** ఫ్రెండ్లీ పోలీసింగ్ కొనసాగిస్తున్నారా? ఫిర్యాదుదారులతో ఎలా మెలుగుతున్నారు?

**ఎస్సై :** మండలంలో సామాన్య ప్రజలకు మాత్రమే ఫ్రెండ్లీ పోలీసింగ్ వ్యవస్థను కొనసాగిస్తున్నాం. కానీ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారి పట్ల కొంచెం కఠినంగానే వ్యవహరిసున్నాం. ఫిర్యాదుదారులతో స్నేహ పూర్వ కంగా మెలుగుతున్నాం. పోలీస్ స్టేషన్లో ఎలాంటి పైరవీలకు తావు లేదు. పార్టీల కతీతంగా ఫిర్యాదు దారులకు సత్వర న్యాయం అందించేందుకు కృషి చేస్తు న్నాం. ప్రజలతో మమేకమై శాంతి భద్రతల పరిరక్షణలో కీలకపాత్ర వహిస్తాం.

# విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

## ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండలోని బాలసముద్రంలో గల గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న ఎంపీటీసీ (మల్టీ పర్పస్ ట్రైనింగ్ సెంటర్)ను శుక్రవారం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కేంద్రంలోని విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, విద్యా బోధన ప్రమాణాలపై సమీక్షించారు. గ్రూప్స్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడిన ఎమ్మెల్యే నాయిని, వారి అవసరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రూప్స్ ప్రిపరేషన్ కోసం అవసరమైన స్టడీ మెటీరియల్‌ను తన సొంత ఖర్చులతో అందిస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ, ప్రభుత్వం విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. గిరిజన అధ్యయన కేంద్రంలో మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తానని, అవసరమైతే ప్రభుత్వ స్థాయిలో పిటిషన్లు వేసి నిధులు మంజూరు చేయిస్తానని భరోసా ఇచ్చారు. ఉమ్మడి జిల్లా నుంచి ఇక్కడ విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులకు ఆయన భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిణి ప్రేమకల, ప్రిన్సిపాల్ శ్రీరాములు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నిషేధిత గంజాయి కేసులో నలుగురి అరెస్ట్



**వరంగల్ వాయిస్, మల్హర్ :** నిషేధిత గంజాయిని సేవించడంతో పాటు, ఇతరులకు విక్రయిస్తున్న నలుగురు వ్యక్తులను కొయ్యూరు పోలీసులు శుక్రవారం అరెస్టు చేసినట్లు కాటారం డీఎస్పీ సూర్యనారాయణ తెలిపారు. మండలంలోని కొయ్యూరు సమీపంలో గల గట్టుపల్లె వద్ద మూసి ఉన్న ప్రభుత్వ పాఠశాల వద్ద గంజాయి రవాణా, అమ్మకం జరుగుతోందని పోలీసులకు సమాచారం అందింది. దీనిపై కొయ్యూరు ఎస్సై నరేష్ తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఈ దాడిలో గట్టుపల్లెకు చెందిన యాదండ్ల నవదీప్, కొండంపేటకు చెందిన కంపల్లి సాయి కుమార్, మల్లారానికి చెందిన భూక్యా రాజు, ఎండీ అజారుద్దీన్‌లను పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 1.23 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని, నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ సూర్యనారాయణ మాట్లాడుతూ, నిషేధిత గంజాయి సరఫరా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాటారం సీఐ నాగార్జున రావు, కొయ్యూరు ఎస్సై నరేష్, ఎస్సై 2 రాజన్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# రెండు కుటుంబాలకు ఆర్థిక సాయం




**వరంగల్ వాయిస్, వరంగల్ :** సనాతన హిందూ సేవా సమితి ఆధ్వర్యంలో రెండు నిరుపేద కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించారు. శుక్రవారం జరిగిన 113వ సేవా కార్యక్రమంలో భాగంగా ఈ సహాయం అందజేశారు. తోగర్రాయి గ్రామానికి చెందిన తుమ్మలపెల్లి రామరాజు ఇటీవల కరెంట్ షాక్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఆయన ఒక చేయి, రెండు కాళ్లు, ఛాతీ భాగం కాలిపోవడంతో వైద్య ఖర్చులకు, కుటుంబ పోషణకు ఇబ్బందులు పడుతున్నారు. వరంగల్ ఉర్సు ప్రాంతానికి చెందిన సోమ నరసయ్యకు ఎటువంటి ఆధారం లేకపోవడంతో జీవనం గడపడం కష్టంగా మారింది. ఈ రెండు కుటుంబాల పరిస్థితిని తెలుసుకున్న సనాతన హిందూ సేవా సమితి సభ్యులు, వారికి రెండు నెలలకు సరిపడా బియ్యం, నిత్యావసర సరుకులను అందించారు. ఈ కార్యక్రమంలో గ్రూప్ వ్యవస్థాపకుడు తాళ్లపల్లి నగేష్, సలహాదారు ప్రతాపగిరి గణేష్, గ్రూప్ సభ్యులు నోముల మహేష్ బాబు, గంగిడి ధర్మారెడ్డి, బదుగు రాము, బైరిశెట్టి కార్తీక్, గుర్రపు రాంచందర్, అవునూరి రాజేష్, ముత్యం మహేందర్ పాల్గొన్నారు.

# పిల్లల ఆరోగ్యానికి పోషకాహారం ముఖ్యం



**వరంగల్ వాయిస్, రేగొండ :** పిల్లల శారీరక, మానసిక అభివృద్ధికి సరైన పోషకాహారం అందించడం అత్యంత అవసరమని ఐసీడీఎస్ రేగొండ సూపర్వైజర్ సంధ్య పేర్కొన్నారు. శుక్రవారం రేగొండ మండల కేంద్రంలోని నాలుగవ అంగన్‌వాడీ కేంద్రంలో 'పోషణ మాసోత్సవం'లో భాగంగా పలు అంశాలపై ఆమె అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడం వల్ల ఎలాంటి రోగాలూ దరిచేరవని, పిల్లలు ఆరోగ్యంగా ఎదుగుతారని తెలిపారు. పోషకాహార అలవాట్లు, శుద్ధి చేసిన తాగునీరు, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత గురించి తల్లిదండ్రులకు వివరించారు. ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా విధానం గురించి కూడా వారికి తెలియజేశారు. పిల్లల ఎదుగుదల కోసం వారిని అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు నామాల రజిత, బొట్ల విమల, బండి ఉమ, మడగాని సుజాత, ఆయా శ్రీలతతో పాటు తల్లిదండ్రులు వేణు, నాగరాజు, సత్యనారాయణ, హేమంత్, సిద్దార్థ, ఆనంద్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# తంయ్యాల శ్రీధరాచార్యులకు సన్మానం




**వరంగల్ వాయిస్, వరంగల్ :** ట్రస్మా వరంగల్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార వేడుకల్లో భాగంగా ప్రముఖ తెలుగు ఉపాధ్యాయులు, వ్యాఖ్యాత, గాయకులు తంయ్యాల శ్రీధరాచార్యులను ఘనంగా సన్మానించారు. వరంగల్ జిల్లాలోని దాదాపు 180 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఈ కార్యక్రమంలో సత్కరించారు. ఎల్.బీ.నగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మాసూమ్ అలీలో తెలుగు ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న శ్రీధరాచార్యులు, గాయకునిగా, వ్యాఖ్యాతగా తన సేవలను అందిస్తున్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం జరిగింది. ఇప్పటికే రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారంతో పాటు, చంద్రబాబు నాయుడు, అక్కినేని నాగేశ్వరరావు వంటి ప్రముఖుల చేతుల మీదుగా 200లకు పైగా అవార్డులు, 500లకు పైగా సన్మానాలు అందుకున్నారు. ఆయన పాడిన 'రారా బడికి రా' పాట రెండు తెలుగు రాష్ట్రాల్లో బహుళ ప్రాచుర్యం పొందింది. కేవలం తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా గుజరాత్, కర్ణాటక, ఢిల్లీ వంటి రాష్ట్రాల్లోని తెలుగు వారిని తన పాటలతో, మాటలతో అలరించారు. వరంగల్ ట్రస్మా జిల్లా అధ్యక్షులు చల్లా నాగార్జున రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి హాజరయ్యారు. ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు సాధుల మధుసూదన్, ప్రధాన కార్యదర్శి నెమురు గొమ్ముల రమేష్ రావు, కోశాధికారి పటోళ్ళ రాఘవేందర్ రెడ్డి, ఇతర రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నాయకులు, ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

# ఎన్ఎస్ఎస్ ప్రీ-రిపబ్లిక్ డే క్యాంప్‌నకు ఉప్పుల శివ ఎంపిక



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** 2026 జనవరి 26న ఢిల్లీలో జరగబోయే రిపబ్లిక్ డే పరేడ్ క్యాంప్‌కు ముందు నిర్వహించే ఎన్.ఎస్.ఎస్ ప్రీ-రిపబ్లిక్ డే పరేడ్ క్యాంప్‌కు కాకతీయ విశ్వవిద్యాలయం తరపున ఉప్పుల శివ ఎంపికయ్యారు.ప్రస్తుతం హనుమకొండ కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీ.ఏ ఫైనల్ ఇయర్ చదువుతున్న శివ, కళాశాలలోని ఎన్.ఎస్.ఎస్ రెండో యూనిట్ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ ఈ అవకాశం పొందారు. శివ స్వస్థలం హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం మర్రిపల్లిగూడెం గ్రామం. శివ ఎంపిక పట్ల కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీనివాస్, ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సీతారాములు మరియు గ్రామ ప్రజలు అభినందనలు తెలిపారు.

# శ్రీనివాస్ తిపిరిశెట్టికి 'గౌరవ డాక్టరేట్'

## 25 ఏళ్ల సామాజిక సేవకు గుర్తింపు



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** గత 25 సంవత్సరాలుగా వివిధ సామాజిక రంగాల్లో అందిస్తున్న సేవలకు గుర్తింపుగా శ్రీనివాస్ తిపిరిశెట్టికి న్యూఢిల్లీకి చెందిన 'ప్రపంచ సంప్రదాయ, పర్యావరణ పరిరక్షణ సేవా సంస్థ' (WCAEPC) గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఈ పురస్కారాన్ని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ చేతుల మీదుగా ఆయన అందుకున్నారు. ప్రతి సంవత్సరం సామాజిక సేవారంగాల్లో విశేష కృషి చేస్తున్న ఉద్యమ నాయకుల వివరాలను WCAEPC సేకరిస్తుంది. సంస్థ నియమాల ప్రకారం దరఖాస్తులను స్వీకరించి, వాటిని క్షుణ్ణంగా పరిశీలిస్తుంది. ఎంపికైన వారికి డాక్టరేట్‌ను ప్రదానం చేస్తుంది. ఈ ప్రక్రియలో భాగంగా శ్రీనివాస్ తిపిరిశెట్టి తన సేవలకు సంబంధించిన ఆధారాలతో దరఖాస్తు చేసుకోగా, సంస్థ ఆయన సేవలను గుర్తించి 2025 సంవత్సరానికి గాను ఈ అవార్డును ప్రకటించింది. గౌరవ డాక్టరేట్ అందుకున్న సందర్భంగా శ్రీనివాస్ తిపిరిశెట్టి మాట్లాడుతూ, గత 25 ఏళ్లుగా తాను చేసిన సామాజిక సేవను గుర్తించి అవార్డు ఇచ్చిన WCAEPC సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందుకోవడం చాలా ఆనందంగా ఉందని ఆయన అన్నారు. డాక్టరేట్ పొందిన శ్రీనివాస్‌కు ఆయన బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు అభినందనలు తెలిపారు.

# అన్నారం దర్గా వద్ద ఫ్లడ్‌లైట్ల ఏర్పాటు



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని అన్నారం దర్గా పరిసరాల్లోని బతుకమ్మ ఆట స్థలంలో వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో ఫ్లడ్‌లైట్లను ఏర్పాటు చేశారు. సుమారు రూ. 50,000 విలువైన 12 ఫ్లడ్‌లైట్లను అమర్చినట్లు అధికారులు తెలిపారు. గ్రామ కార్యదర్శి చొరవతో బతుకమ్మ ఆడుకునే మహిళల సౌకర్యం కోసం, అలాగే దర్గా పరిసర ప్రాంతాల్లో, లోపల లైటింగ్ మెరుగుపరచడం కోసం ఈ లైట్లను ఏర్పాటు చేశారు. గ్రామ మౌలిక సదుపాయాల కల్పనలో వక్ఫ్ బోర్డు ఎల్లప్పుడూ సహకారం అందిస్తుందని అధికారులు పేర్కొన్నారు.

# కేయూ డిగ్రీ పరీక్షల ఫీజు నోటిఫికేషన్

**వరంగల్ వాయిస్, కేయూ:** కాకతీయ విశ్వవిద్యాలయం డిగ్రీ మొదటి, మూడవ, ఐదవ సెమిస్టర్ పరీక్షల ఫీజు నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ మేరకు పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణ అధికారులు డాక్టర్ ఎం. తిరుమలదేవి, డాక్టర్ పి. వెంకటయ్య సంయుక్తంగా ఒక ప్రకటనలో తెలిపారు. అపరాధ రుసుము లేకుండా అక్టోబర్ 15 వరకు, రూ. 50 అపరాధ రుసుముతో అక్టోబర్ 22 వరకు గడువు ఉన్నట్లు తెలిపారు. మరిన్ని వివరాల కోసం విద్యార్థులు, కళాశాల యాజమాన్యాలు విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ www.kakatiya.ac.inను సందర్శించాలని అధికారులు సూచించారు.

# గుర్తు తెలియని శవం లభ్యం

**వరంగల్ వాయిస్,ఆత్మకూరు :** మండలంలోని లింగమడుపల్లి శివారులోని వేముల వీరస్వామి బావిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఆత్మకూరు సీఐ సంతోష్ తెలిపారు. మృతుని వయస్సు సుమారు 45 నుంచి 50 సంవత్సరాల మధ్య ఉంటుందని అంచనా వేశారు. మృతదేహం లభ్యమైన సమయంలో ఆ వ్యక్తి తెలుపు రంగు గీతల చొక్కా (ఫుల్ షర్ట్), నీలం రంగు ఏడవ నంబర్ చెప్పులు ధరించి ఉన్నాడు. కుడి చేతి ఉంగరపు వేలికి ఒక ఉంగరం ఉంది. అయితే ముఖం గుర్తుపట్టలేని స్థితిలో ఉందని సీఐ పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని బయటకు తీసి పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు ఆత్మకూరు పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ఓను 8712685225 నంబర్‌కు లేదా ఎస్సైను 8712685252 నంబర్‌కు సంప్రదించాలని సీఐ కోరారు.

# రైతాంగంపై ప్రభుత్వాలు నిర్లక్ష్యం వీడాలి

◆ ఏఐయూకేఎస్జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్ర సూరి




**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ రాష్ట్రంలోని రైతాంగం, వ్యవసాయ రంగం పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని విడనాడాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం (ఏఐయూకేఎస్) వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్ర సూరి డిమాండ్ చేశారు. శుక్రవారం ఖిలా వరంగల్ మండల కేంద్రంలో ఏఐయూకేఎస్ ఆధ్వర్యంలో ఖరీఫ్ సీజన్‌కు సరిపడా యూరియా, డీఏపీ ఎరువులు అందించాలని కోరుతూ మండల ఏఈఓ ప్రకాష్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా చిర్ర సూరి మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటి నుంచి వ్యవసాయ మంత్రులు, అధికారులు ఎరువుల కొరత లేదని రైతులను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. క్షేత్ర స్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉందని, రైతులు యూరియా, డీఏపీ కోసం సహకార సంఘాల వద్ద క్యూలైన్లలో గంటల తరబడి నిలబడి ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమయానికి ఎరువులు అందక స్పృహతప్పి పడిపోతున్న సంఘటనలు కూడా జరుగుతున్నాయని తెలిపారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రాజకీయ లబ్ధి కోసం తెలంగాణ రైతులకు సరిపడా ఎరువులు అందించడం లేదని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా తమ నిర్లక్ష్య వైఖరిని విడనాడి, రైతులు పండిస్తున్న అన్ని రకాల పంటలకు ఎకరానికి కనీసం నాలుగు బస్తాల యూరియా, డీఏపీ అందించాలని డిమాండ్ చేశారు. దేశ వ్యవసాయ రంగం, రైతాంగం పట్ల ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ రైతులంతా ఐక్యంగా ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐయూకేఎస్ వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడు మైదం పాణి, డివిజన్ నాయకులు సాబిరీ కాని మోహన్, సాగర్, భిక్షపతి, రాజు, శ్రీధర్, తిరుపతి, రాజన్న, వెంకటయ్య, ప్రసాద్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

# జోయాలుక్కాస్ బ్రిలియన్స్ డైమండ్ జ్యువెలరీ షో ప్రారంభం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఆభరణాల తయారీలో ప్రపంచ ప్రఖ్యాత సంస్థ జోయాలుక్కాస్ నిర్వహించే ప్రతిష్టాత్మక 'బ్రిలియన్స్ డైమండ్ జ్యువెలరీ షో' వరంగల్‌లో ప్రారంభమైంది. ఈ నెల 19న ఈ ప్రదర్శనను పరకాల ఏసీపీ సతీష్ బాబు ప్రారంభించారు. ఈ ప్రత్యేక ప్రదర్శన అక్టోబర్ 5 వరకు వరంగల్‌లోని జోయాలుక్కాస్ షోరూంలో కొనసాగనుంది. జోయాలుక్కాస్ తమ వైభవానికి, కళాత్మకతకు పేరుగాంచిన ఈ ప్రత్యేక ప్రదర్శనలో అత్యుత్తమ అభిరుచి గల వారి కోసం ప్రత్యేకంగా రూపొందించిన పరిమిత ఎడిషన్ వజ్రాలు, విలువైన ఆభరణాల సేకరణలను ప్రదర్శిస్తున్నారు. ఈ షోలో అద్భుతమైన పెళ్లి సెట్ల నుంచి నిత్యం ధరించదగిన ఆధునిక ఆభరణాల వరకు అనేక కళాఖండాలు ఉన్నాయి. ప్రతి డిజైన్ సంప్రదాయాన్ని, ఆధునికతను మిళితం చేసి రూపొందించబడిందని సంస్థ పేర్కొంది. ఈ సందర్భంగా జోయాలుక్కాస్ ఒక ప్రత్యేక లాంచ్ ఆఫర్‌ను ప్రకటించింది. ఇందులో భాగంగా, కొనుగోలుదారులు బంగారం, వజ్రాలు, రత్నాలు, ప్లాటినం మరియు వెండి నగలపై మేకింగ్ ఛార్జీలు (V.A)పై 50% అద్భుతమైన తగ్గింపు పొందుతారు. అంతేకాకుండా, ప్రతి కొనుగోలుతో ఒక నిర్ధారిత బహుమతిని కూడా గెలుచుకోవచ్చు. ఈ సందర్భంగా జోయాలుక్కాస్ గ్రూప్ చైర్మన్ డాక్టర్ జాయ్ ఆలుక్కాస్ మాట్లాడుతూ, "వరంగల్ ఎల్లప్పుడూ అద్భుతమైన ఆభరణాల కేంద్రంగా ఉంది. 'బ్రిలియన్స్ డైమండ్ జ్యువెలరీ షో'తో మేము సౌందర్యం మరియు నైపుణ్యం యొక్క అత్యున్నత అనుభూతిని ప్రతిబింబించే సేకరణను ప్రదర్శించాము. ఈ ప్రదర్శన వ్యక్తిత్వం, శృంగారం, భావోద్వేగాల వేడుకగా నిలిచింది" అని తెలిపారు.ఈ ప్రదర్శన జోయాలుక్కాస్ వరంగల్ షోరూంలో అక్టోబర్ 5 వరకు మాత్రమే అందుబాటులో ఉంటుంది.

# సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహావిష్కరణ



**వరంగల్ వాయిస్, గణపురం :** మండల విద్యా వనరుల కేంద్రంలో ఏర్పాటు చేసిన భారతరత్న డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహాన్ని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు (జీఎస్సార్) శుక్రవారం ఆవిష్కరించారు. ఈ విగ్రహాన్ని దివంగత ఊరుగొండ రాధాదేవి గారి జ్ఞాపకార్థం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ కేవలం ఉపాధ్యాయులకే కాకుండా దేశానికే ఆదర్శంగా నిలిచారని అన్నారు. విద్య అనేది కేవలం పాఠశాలల్లో మాత్రమే కాకుండా మన జీవన విధానం, నైతిక విలువల్లోనూ ప్రతిబింబించాలని సూచించారు. ఉపాధ్యాయులు దేశ నిర్మాణ శిల్పులని, వారు బలోపేతం అయితేనే సమాజం బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. అనంతరం గణపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన మండల విద్యాశాఖాధికారి ఊరుగొండ ఉప్పలయ్య ఉద్యోగ విరమణ కార్యక్రమానికి ఎమ్మెల్యే జీఎస్సార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ అనివార్యమని, విరమణానంతరం కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. వృత్తి పట్ల గౌరవం, అంకితభావం కలిగిన ఆదర్శ వ్యక్తి ఉప్పలయ్య అని కొనియాడారు. ఆయన ఉద్యోగ విరమణ తోటి ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులకు బాధాకరమని అన్నారు.

# కొండా మురళిని కలిసిన కాశిబుగ్గ దసరా ఉత్సవ సమితి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** దసరా ఉత్సవాల ఏర్పాట్లపై కాశిబుగ్గ దసరా ఉత్సవ సమితి సభ్యులు శుక్రవారం మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావుతో సమావేశమయ్యారు. హనుమకొండ రాంనగర్‌లోని ఆయన నివాసంలో ఈ భేటీ జరిగింది. ఉత్సవ సమితి అధ్యక్షుడు ధూపం సంపత్ ఆధ్వర్యంలో సభ్యులు కొండా మురళీధర్ రావుకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాశిబుగ్గలో జరిగే దసరా వేడుకలకు ఐదు డివిజన్ల ప్రజలతో పాటు గ్రామీణ ప్రాంతాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరవుతారని తెలిపారు. వేడుకల కోసం మైదానం శుభ్రం చేయడం, లైటింగ్, సౌండ్ సిస్టం, వేదిక ఏర్పాటు, బారికేడ్లు, నీటి సరఫరా, పోలీసు బందోబస్తు, విద్యుత్ సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది, సాంస్కృతిక కార్యక్రమాల వంటి ఏర్పాట్లను ప్రభుత్వమే చేపట్టాలని కోరారు. దీనిపై స్పందించిన కొండా మురళీధర్ రావు, ఉత్సవాలకు అవసరమైన అన్ని సదుపాయాలను మంత్రి కొండా సురేఖ ఏర్పాట్లు చేస్తారని హామీ ఇచ్చారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌కు ఫోన్ చేసి, ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నవీన్ రాజ్, వర్కింగ్ ప్రెసిడెంట్ గుల్లపల్లి రాజ్ కుమార్, కన్వీనర్ భయ్యా స్వామి, ప్రధాన కార్యదర్శి సముద్రాల పరమేశ్వర్, మాజీ కార్పొరేటర్ ఓని భాస్కర్, గోరంట్ల మనోహర్, గుత్తికొండ నవీన్, గుర్రపు సత్యనారాయణ, గణిపాక సుధాకర్, మార్టిన్ లూథర్, సిద్ధోజు శ్రీనివాస్, రామ యాదగిరి, బిల్లా శివ, క్యాతం రంజిత్, బాల మోహన్, తొగరు వీరన్న, గణిపాక కిరణ్, దేవర ప్రసాద్, పెండ్యాలసోను, కోటసతీష్, చింతం రాజు, కాశిబుగ్గ దసరా ఉత్సవ కమిటీసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# దుమ్మురేపుతున్న శాన్వీ శ్రీవాస్తవ



ఈ బ్యూటీ చేసింది తెలుగులో నాలుగు సినిమాలే.. తొలి సినిమాతోనే మంచి విజయాన్ని అందుకుంది. ఆతర్వాత వరుసగా సినిమాలు చేసింది. కొన్ని సినిమాల్లో తన అందంతో ప్రేక్షకులను కవ్వించింది. కానీ చేసిన సినిమాల్లో మొదటి సినిమా తప్ప మిగిలినవి అన్ని ఫ్లాప్ అయ్యాయి. దాంతో ఆమె తెలుగు సినిమాలకు పూర్తిగా దూరం అయ్యింది. ఇంతరభాషల్లో సినిమాలు చేస్తుంది. కానీ అక్కడ కూడా స్టార్ గా ఎదగలేకపోయింది. లవ్లీ సినిమా గుర్తుందా.? ఆది సాయి కుమార్ హీరోగా నటించిన ఈ సినిమాకు బీఏ జయ దర్శకత్వం వహించారు. ఈ సినిమా మంచి విజయాన్ని అందుకుంది. ఈ సినిమాలో హీరోయిన్ గా నటించింది శాన్వీ శ్రీవాస్తవ. తొలి సినిమాతోనే తన క్యూట్ పర్ఫామెన్స్ తో కవ్వించింది. ఆతర్వాత ఈ బ్యూటీకి వరుస ఆఫర్స్ వచ్చాయి. సుశాంత్ అడ్డా, మంచు విష్ణు రౌడీ, మరోసారి ఆదితో ప్యార్ మే పడిపోయానే సినిమాల్లో నటించింది. కానీ అవేమి వర్కౌట్ కాలేదు. దాంతో కన్నడ ఇండస్ట్రీకి వెళ్ళింది. అక్కడ కాస్త పర్లేదు అనిపించుకుంది. ఆ మధ్య అతడే శ్రీమన్నారాయణ డబ్బింగ్ మూవీతో మరోసారి తెలుగు ప్రేక్షకులను పలకరించింది. ఆ సమయంలో శాన్వీ మాట్లాడుతూ తెలుగులో అవకాశాలు రావడం లేదు అని కన్నీళ్లు పెట్టుకుంది. తనకు ఎందుకు ఛాన్స్ లు రాలేదో అర్థం కావడం లేదు అని స్టేజ్ పైనే కన్నీళ్లు పెట్టుకుంది ఈ ముద్దుగుమ్మ. ఇక ఇప్పుడు కన్నడలోనే సినిమాలు చేస్తుంది. అక్కడ కూడా ప్రస్తుతం శాన్వీ శ్రీవాస్తవకు చెప్పుకోదగ్గ సినిమాలు రావడం లేదు. సోషల్ మీడియాతోనే ఈ చిన్నది కాలం గడిపేస్తుంది. ఓ రేంజ్ లో అందాలు ఆరబోస్తూ అభిమానులను ఆకట్టుకుంటుంది.

# కుర్రకారులకు హీటెక్కిస్తున్న అనుపమ పరమేశ్వరన్




అందాల ముద్దుగుమ్మ అనుపమ పరమేశ్వరన్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. సింపుల్‌గా కనిపిస్తూనే కుర్రకారు మనసుదోచేస్తుంది ఈ బ్యూటీ. తాజాగా ఈ అమ్మడు చుఢీదార్‌లో తన అంద చందాలతో మతి పోగొడుతుంది. మరి మీరు కూడా ఆఫొటోస్ పై ఓ లుక్ వేయండి. బ్యూటీ అనుపమ పరమేశ్వరన్ గురించి ఎంత చెప్పినా తక్కువే. ఈ అమ్మడు తన నటనతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. రీసెంట్‌గా రెండు సినిమాలతో ఆడియన్స్ ముందుకు వచ్చింది. అందులో ఒకటి డిజాస్టర్ అయినా మరో మూవీ బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. దీంతో ఈ బ్యూటీ కెరీర్ మరింత ఫామ్‌లోకి వచ్చిందనే చెప్పాలి. ప్రేమమ్ మూవీతో తెలుగు వెండితెరకు పరిచయమైన చిన్నది అనుపమ పరమేశ్వరన్, ఈ అమ్మడు మొదటి సినిమాతో మంచి ఫేమ్ తెచ్చుకుంది. దీంతో వరసగా ఆఫర్స్ అందుకుంటూ, టాలీవుడ్ క్రేజీ హీరోయిన్‌గా తన సత్తా చాటుతుంది. రీసెంట్‌గా పరదా మూవీతో తెలుగు అభిమానులను పలకరించింది ఈ బ్యూటీ కానీ ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్‌గా నిలిచింది. కానీ కిష్కిందపురి సినిమాతో బ్లాక్ బస్టర్ ఖాతాలో వేసుకొంది. ఈ అమ్మడు డీజే టిల్లు స్క్వేర్ మూవీతో మంచి ఫాన్ ఫాలోయింగ్ సంపాదించుకుంది. ఈ మూవీలో ఈ అమ్మడు గ్లామర్‌కు ప్రతి ఒక్కరూ ఫిదా అయ్యారు.దీంతో ఈ మూవీ తర్వాత వరసగా ఆఫర్స్ అందుకుంటూ బ్లాక్ బస్టర్స్ హిట్స్ తన ఖాతాలో వేసుకుంటుంది. సక్సెస్ జోష్‌లో ఉన్న ఈ చిన్నది తాజాగా చుఢీదార్‌లో తన అంద చందాలతో అందరి మనసు దోచేస్తూ నెట్టింట హల్ చల్ చేస్తుంది.

# మోహన్‌లాల్ వృషభ ట్రైలర్ విడుదల



మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్ ప్రధాన పాత్రలో నటిస్తున్న భారీ బడ్జెట్ పాన్ ఇండియా చిత్రం 'వృషభ'. ఈ సినిమాకు నంద కిషోర్ దర్శకత్వం వహిస్తుండగా.. కనెక్ట్ మీడియా, బాలాజీ టెలిఫిల్మ్స్, అభిషేక్ ఎస్. వ్యాస్ స్టూడియోస్, ఆశీర్వాద్ సినిమాస్ సమర్పిస్తున్నాయి. శోభా కపూర్, ఏక్తా ఆర్. కపూర్, సి.కె. పద్మకుమార్, వరుణ్ మాథుర్, సౌరభ్ మిశ్రా, అభిషేక్ ఎస్. వ్యాస్, ప్రవీర్ సింగ్, విశాల్ గుర్నాని, జుహి పరేఖ్ మెహతా సంయుక్తంగా నిర్మిస్తున్నారు. పాన్ ఇండియాగా రాబోతున్న ఈ చిత్రం దీపావళి కానుకగా ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి టీజర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ మూవీ టీజర్ చూస్తుంటే.. మోహన్‌లాల్ ఇందులో యోధుడి పాత్రలో కనిపించనున్నారు. యాక్షన్ ప్యాక్డ్‌గా ఉన్న ఈ ట్రైలర్ ప్రస్తుతం ఆకట్టుకుంటుంది.

# రికార్డులు సృష్టిస్తున్న మిరాయ్




యంగ్ హీరో తేజ సజ్జా నటించిన మిరాయ్ బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతోంది. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో రితికా నాయక్ హీరోయిన్‌గా, మంచు మనోజ్ శక్తివంతమైన విలన్‌గా నటించారు. సెప్టెంబర్ 12న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన ఈ సినిమా కేవలం ఐదు రోజుల్లోనే 100 కోట్ల మార్క్ దాటగా, 7 రోజుల్లో రూ.112.10 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించినట్లు పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ అధికారికంగా ప్రకటించింది. ఈ విషయాన్ని సోషల్ మీడియాలో స్పెషల్ పోస్టర్ ద్వారా షేర్ చేశారు. 'మిరాయ్'. తేజ సజ్జా హీరోగా, మంచు మనోజ్ శక్తివంతమైన విలన్ పాత్రలో నటించిన ఈ చిత్రం వసూళ్ల పరంగా మాత్రమే కాకుండా, కంటెంట్ పరంగా కూడా ప్రశంసలు అందుకుంది. సైన్స్ ఫిక్షన్, యాక్షన్, భావోద్వేగాల మేళవింపుగా సాగే ఈ కథలో 'మహాబీర్ లామా' పాత్రలో మంచు మనోజ్ కొత్తగా కనిపించగా తేజ సజ్జా మరోసారి తన నటనతో యూత్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాడు. దర్శకుడు కార్తీక్ ఘట్టమనేని విజువల్స్, కథనం, టెక్నికల్ ప్రెజెంటేషన్‌తో కొత్త రేంజ్‌లో సినిమాను తీర్చిదిద్దాడు. వీఎఫ్ఎక్స్ వర్క్, యాక్షన్ సీక్వెన్సులు హాలీవుడ్ స్థాయిలో ఉండటంతో ప్రేక్షకులు వెండితెరపై మళ్లీ మళ్లీ చూసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. నిర్మాత టీజీ విశ్వప్రసాద్ భారీ బడ్జెట్‌తో రాజీ లేకుండా ఈ చిత్రాన్ని నిర్మించారు.



# ఆల్ పార్టీస్ మోసం

- బడ్జెట్ లో బీసీలకు లక్ష కోట్లు కేటాయించాలి
- టీఆర్పీ రాష్ట్ర అధ్యక్షుడు తీన్మార్ మల్లన్న
- సమావేశంలో ప్రకటించిన వరంగల్ డిక్లరేషన్

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతున్నా కామారెడ్డి డిక్లరేషన్ పట్టించుకోలేదని, బీసీలకు కాంగ్రెస్ సహా బీఆర్ఎస్, బీజేపీలు మోసం చేశాయని తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధ్యక్షుడు తీన్మార్ మల్లన్న ఆరోపించారు. హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్ లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వరంగల్ డిక్లరేషన్ ను ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాము పది అంశాలను ఎజెండాగా పెట్టుకుని ముందుకు సాగుతున్నామన్నారు. ప్రొపెసర్ జయశంకర్ సార్ ను జాతిపితగా గుర్తించాలని, బడ్జెట్ లో బీసీలకు ప్రతి సంవత్సరం లక్ష కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేదంటే అధికారంలోకి వచ్చిన తరువాత మేమే కేటాయిస్తామన్నారు. అలాగే కొండా లక్ష్మణ్ బాపూజీకి భారతరత్న ఇవ్వాలని రెండో అంశంగా పెట్టుకున్నామన్నారు. జనాభా దామాషా ప్రకారం విద్య, వైద్యం తదితర రంగాల్లో రిజర్వేషన్ అమలు చేయాలని కామన్ మినిమంలో పెట్టామన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ ప్రతి సంవత్సరం రూ.20 వేల కోట్లు ఖర్చుచేస్తామని చెప్పి కనీసం రూ.2 వేల కోట్లు కూడా ఖర్చు పెట్టలేదన్నారు. గడిచిన రెండేండ్ల కాలంలో కాంగ్రెస్, గత పదేళ్ల కాలంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ బీసీలను మోసం చేశాయన్నారు. బీసీలలో భూమిలేని కుటుంబాలు 18 లక్షలు ఉన్నాయన్నారు. తాము అధికారంలోకి వస్తే భూమి లేని బీసీలకు రెండు ఎకరాల భూమి ఇస్తామన్నారు. తెలంగాణలో మేము ఎవ్వరికి శత్రువులం కాదన్నారు. మా పార్టీలో అందరికి స్థానం ఇస్తామన్నారు. అగ్రవర్ణ పేదలను ఆదుకుంటామని, వారందరికీ ఇల్లు నిర్మించి ఇస్తామన్నారు. సచార్ కమిటీ ఆధారంగా ముస్లింల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. విద్య, ఉద్యోగ రంగాల్లో జనాభా దామాషా ఆధారంగా రిజర్వేషన్లు కల్పిస్తామన్నారు. ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు చేస్తామన్నారు. ప్రతి ఒక్కరికీ ఉచిత విద్య, వైద్య సేవలు కార్పొరేట్ స్థాయిలో అందిస్తామని, మహిళకు సముచిత స్థానం కల్పిస్తామన్నారు. వరంగల్ ను రెండో రాజధానిగా చేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్ 26 అంశాలు ప్రకటించి ఒక్కటి కూడా అమలు చేయలేదన్నారు. రాష్ట్రంలో బీసీలను, బీసీ ఉద్యోగులను అణచివేయాలని చూస్తే ఊరుకోమన్నారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో పార్టీ తరపున పోటీ చేస్తామన్నారు. ఈ విలేఖరుల సమావేశంలో టీఆర్పీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ లు ఎం.రజినీ కుమార్ యాదవ్, హరిశంకర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి వట్టెం జానయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### భద్రకాళి సందర్శన..

వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానాన్ని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న శుక్రవారం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన మల్లన్నకు ఆలయ ధర్మకర్తలు తొనుపునూరి వీరన్న, గాదె శ్రవణ్ కుమార్ రెడ్డి, ఓరుగంటి పూర్ణచందర్, మోతుకూరి మయూరి–రామేశ్వర్ రావు, జారతి వెంకటేశ్వర్లు, అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజానంతరం అర్చకులు మహదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేషవస్త్రములు బహుకరించి ప్రసాదాలు అందజేశారు.

# ఎకో టూరిజం హబ్ గా తెలంగాణ

- ఆలయాలున్న ప్రాంతాల్లో ఆథ్యాత్మిక శోభ
- నీలాద్రి అభివృద్ధికి ప్రత్యేక చొరవ
- రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణను ఎకో టూరిజం హబ్ గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. ఎకో టూరిజం కోసం రాష్ట్రంలోని గుర్తించిన సైట్లలో సమగ్రంగా అభివృద్ధి చేపట్టాలన్నారు. శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలో ఎకోటూరిజం ప్రాజెక్టు స్క్రీనింగ్ కమిటీ సమావేశం మంత్రి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఎఫ్డీసీ చైర్మన్ పొదెం వీరయ్య, అటవీ శాఖ ప్రిన్స్ పల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్, పీసీసీఎఫ్(హెచ్ఓఎఫ్ఎఫ్) డాక్టర్ సువర్ణ, తెలంగాణ ఎఫ్డీసీ ఎండీ సునీత భగవత్, పీసీసీఎఫ్(వైల్డ్ లైఫ్) ఏలూ సింగ్ మేరు, సీసీఎఫ్ డాక్టర్ జి.రామలింగం (సోషల్ ఫారెస్టు), పలు జిల్లాల డీఎఫ్ఓలు, ఆర్థిక శాఖ సహా ఇతర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. స్థానిక గిరిజనులు, ఇతర ప్రాంతాల ప్రజల ఆచార వ్యవహారాలు, సంస్కృతి, సాంప్రదాయాలకు అనుగుణంగా ఎకో టూరిజం ప్రాజెక్టులను అమలు చేయాలని మంత్రి సూచించారు. ఎకో టూరిజం డెవలప్ చేస్తున్న ప్రాంతాల్లో టెంపుల్స్ ఉంటే వాటిని కూడా ఆ మేరకు డెవలప్ చేయాలని సూచించారు. మధ్యప్రదేశ్‌లోని భీమ్‌బెక్కా కొండల తరహాలో నీలాద్రి కొండలపై ప్రాచీన కాలం నాటి గుర్తులు ఉన్నందున పర్యాటక ప్రాంతంగా



ఎకో టూరిజం ప్రాంతంగా డెవలప్ చేయాలన్నారు. ఈ సమావేశంలో తెలంగాణలో వివిధ జిల్లాల్లో జరుగుతున్న ఎకో–టూరిజం ప్రాజెక్టుల పురోగతిని మంత్రి కొండా సురేఖ సమీక్షించారు. ఎకో–టూరిజం ప్రాజెక్టులు కేవలం ప్రకృతి వైభవం వరకే పరిమితం కాకుండా, అక్కడి ఆలయ ఆధ్యాత్మిక వాతావరణాన్ని కూడా ప్రతిబింబించేలా అభివృద్ధి చేయాలని మంత్రి కొండా సురేఖ సమావేశంలో ప్రస్తావించారు. ఎక్కడ ఆలయాలు ఉన్నాయో అక్కడి ఆధ్యాత్మికత, సంప్రదాయాలు, ధార్మిక విశ్వాసాలు ప్రతిబింబించేలా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. పర్యాటకులు కేవలం స్థానిక ప్రకృతి సౌందర్యం మాత్రమే కాకుండా, ఒక విశ్వాసం, ఆధ్యాత్మిక అనుభూతితో కూడిన తృప్తితో సందర్శిస్తారని గుర్తు చేశారు.



# యువత స్వయం ఉపాధి దిశగా ఆలోచించాలి

□ హనుమకొండ ఏసీపీ పి.నరసింహ రావు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** యువత ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకొని ముందుకు సాగాలని హనుమకొండ ఏసీపీ పి.నర్సింహరావు అన్నారు. శుక్రవారం నయంనగర్ లో భూమ మిల్క్ పార్లర్ ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ యువత వాణిజ్, వ్యాపార రంగాలవైపు దృష్టి సారించడం అభినదనీయం అన్నారు. ప్రభుత్వ రంగంలో ఉద్యోగాలు రాక చాలా మంది నిరాశకు గుర్తై జీవితాలను నాశనం చేసుకోవటం బాధాకరం అన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాలతో పాటు స్వయం ఉపాధి రంగాల వైపు యువత దృష్టి సారిస్తే సక్సెస్ సాధ్యం అవుతుందని అన్నారు. ముఖ్యంగా ఉన్నత చదువులు చదివి నూతన ఆలోచనలతో మిల్క్ పార్లర్ పెట్టడం చాలా సంతోషం అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, పార్లర్ యజమాని భూమ సతీష్, డాక్టర్ రహీమ్, డాక్టర్ నరసింహ, రమాకాంత్ పాల్గొన్నారు.



# అరకొరగా యూరియా.. ఆందోళనలో అన్నదాతలు

- దిగుబడిపై తీవ్ర ప్రభావం
- 200 బస్తాలకు మాత్రమే టోకెన్లు

**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని రైతులను యూరియా కొరతతో తీవ్ర ఇబ్బందులను పెడుతోంది. పంటలకు సరిపడా యూరియా అందుబాటులో లేకపోవడంతో పత్తి, వరి పంటల దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**టోకెన్ల కోసం పరుగులు:** వరికోల్ క్లస్టర్ రైతు వేదిక వద్ద శుక్రవారం యూరియా బస్తాల కోసం టోకెన్లు ఇస్తున్నారన్న సమాచారంతో చుట్టుపక్కల గ్రామాల నుంచి దాదాపు 400 మంది రైతులు అక్కడికి చేరుకున్నారు. అయితే, కేవలం 200 బస్తాలకు మాత్రమే టోకెన్లు ఇవ్వడంతో, మిగతా రైతులు తీవ్ర నిరాశతో వెనుదిరగాల్సి వచ్చింది. సాగు పనులు చేసుకోవాల్సిన రైతులు యూరియా కోసం పడిగాపులు కాయాల్సిన దుస్థితి ఏర్పడిందని వాపోయారు.

### గ్రామం యూనిట్‌గా పంపిణీ చేయాలి :

**- మేకమల్ల వెంకటేష్, రైతు, ముస్త్యాలపల్లి**



గ్రామాన్ని యూనిట్ గా తీసుకొని యూరియా పంపిణీ చేయాలి. రైతు వేదిక పరిధిలో పంపిణీ చేయడం వల్ల చుట్టుపక్కల గ్రామాల రైతులు చేరుకునే లోపే యూరియా నిల్వలు అయిపోతున్నాయి. ఒక్క బస్తా యూరియా కూడా తమకు సరిగా అందడం లేదని, పొట్ట దశలో ఉన్న వరి పంటను కాపాడుకోవడానికి ప్రతి గ్రామం తిరగాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యూరియా కొరతతో తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలి.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com